క్లుప్తంగా

అంధకారంలో ఆస్పత్రి ప్రాంగణం



ఆస్పత్రి ఆవరణలో అలుముకున్న చీకటి

ఎన్‌పీకుంట: మండల కేంద్రం ఎన్‌పీకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆస్పత్రి ప్రవేశ ద్వారం నుంచి ఆవరణం వరకు సాయంత్రం వేళ అంధకారం అలుముకుంటోంది. ఇక్కడ బయటి వైపు సోలార్ సిస్టమ్ ద్వారా లైట్లు అమర్చారు. వారం నుంచి ఈ లైట్లు వెలగడం లేదు. దీనికితోడు విద్యుత్ స్తంభానికి ఉన్న లైట్ పని చేయలేదు. ఈ ఆస్పత్రికి రోజూ 120 నుంచి 150 మంది వరకు రోగులు వస్తుంటారు. రాత్రివేళ చిమ్మ చీకటిలో ఆస్పత్రిలోకి రావడానికి రోగులు భయాందోళన చెందుతున్నారు.

ధర్నా జయప్రదం చేయండి

కదిరి టౌన్: బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో 50 శాతం రిజర్వేషన్, బీసీ కుల గణన, సమగ్ర జన గణన కోసం ఫిబ్రవరి 9న గుంటూరులో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం కదిరిలోని ఆర్ అండ్‌బీ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

ధర్మవరం: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, గాంధీనగర్, అంజుమన్ సర్కిల్‌లోని ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై బుధవారం దాడులు నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో 70 కేజీల ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, రూ.10వేల జరిమానా విధించామని చెప్పారు.

మోడల్ పేపర్స్ అందజేత

ధర్మవరం రూరల్: యూటీఎఫ్ రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్లను బుధవారం గొట్లూరుకు చెందిన శ్రీనివాసులు సౌజన్యంతో గొట్లూరు జెడ్పీ హైస్కూల్‌లో 56 మంది విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ రాజేశ్వరి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.

వృద్ధురాలికి గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో బుధవారం కారు ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గూడ్స్‌షెడ్ కొట్టాలకు చెందిన నరసమ్మ అనే వృద్ధురాలు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి కాలు విరిగింది.

వ్యక్తి మృతిపై ఫిర్యాదు

తనకల్లు: గేమేనాయక్‌తండాకు చెందిన శ్రీనివాసులు నాయక్ (45) మరికొంతమందితో కలిసి మండ్లిపల్లి మిట్ట సమీపాన కొంత భూమి కొనుగోలు చేశారు. అందులో రాళ్లు పాతడానికి బుధవారం వెళ్లారు. ఆ భూమి తమదంటూ కొంతమంది వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాళ్లు పాతనీయలేదు. ఈ క్రమంలో శ్రీనివాసులునాయక్ గుండెపోటుకు గురై కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు ఆయన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. జరిగిన ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని శాంతి ఆనంద పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ, శివ పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 300 మంది శివ భక్తులు, విదేశీయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్నాచర్లపై అప్రమత్తంగా ఉండాలి

ఓడీచెరువు: మహిళలను ఏమార్చి బంగారు గొలుసులను లాక్కెళ్లే స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. మండల పరిధిలోని సుందరయ్యకాలనీలో ఎస్‌ఐ తన సిబ్బందితో గ్రామ సభ ఏర్పాటు చేసి ఇటీవల జరిగిన దొంగతనాల గురించి తెలియజేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఊరి చివరన దుకాణాలు నిర్వహించేవారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పోతుకుంటలో ఫుట్ పెట్రోలింగ్

ధర్మవరం రూరల్: పోతుకుంటలో బుధవారం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామం వెలుపల మందుబాబులు, ఆకతాయిలు లేకుండా పెట్రోలింగ్ చేపట్టారు.

పింఛన్‌దారుల అర్హతల పరిశీలన



పింఛన్‌దారులను పరిశీలిస్తున్న అధికారులు

ఎన్‌పీకుంట: మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల అర్హతలను మండల వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్‌తో కలిసి వైద్యాధికారులు సంతోష్ కుమార్, హర్ష పరిశీలించినట్లు ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు.

తాడిమర్రి: చిల్లవారిపల్లిలో రూ.15వేల పింఛన్ దారుల అర్హతలను ప్రత్యేక అధికారులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ చైతన్య, డాక్టర్ హరిత బుధవారం పరిశీలించారు.

గజిబిజి.. గందరగోళం

- పుట్టపర్తిలో ట్రాఫిక్ అస్తవ్యస్తం
- ప్రధాన రోడ్లపై పెరిగిపోతున్న రద్దీ
- పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలేవీ?
- ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేదెన్నడు?



పుట్టపర్తిలో ప్రధాన రహదారిలో నిలిచిన వాహనాలు

పుట్టపర్తి టౌన్: ప్రపంచ ఆధ్యాత్మిక ధామం.. జిల్లా కేంద్రం పుట్టపర్తి. ప్రశాంతి నిలయం, సత్యసాయి విద్యాసంస్థలు, సత్యసాయి వైద్యశాలలు, వివిధ రంగాల బ్యాంకులు, మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. సత్యసాయి మహాసమాధి దర్శనం కోసం దేశవిదేశాలకు చెందిన భక్తులు రోజూ అధిక సంఖ్యలో వస్తుంటారు. విద్యా గిరి ఆర్చ్ నుంచి హనుమాన్ సర్కిల్ వరకు జనం రద్దీతో పాటు వాహనాల రాకపోకలూ అధికమే. ఇలాంటి చోట వాహనాల పార్కింగ్ ప్రధాన సమస్యగా మారింది. ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో స్థానికులు.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ప్రధాన రోడ్లపైన, దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర సమయంలో అంబులెన్సులు, ఫైరింజన్లు రావడానికి ఇబ్బందికరంగా ఉంటోంది.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

పుట్టపర్తిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. వాహనాల రాకపోకలు అధికం. ఏ రోడ్డు చూసినా కిటకిటలాడుతుంటాయి. 45వేలకు పైగా జనాభా కలిగిన ఈ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం తగినంత మంది పోలీసులు లేరు. దీంతో ట్రాఫిక్ సమస్యను గాలికొదిలేశారు. నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి.. వన్‌సైడ్ పార్కింగ్ సిస్టమ్ అని ప్రకటించినా అమలులో పూర్తిగా విఫలం చెందారు. పట్టణంలో ప్రతి దుకాణం ముందు ద్విచక్రవాహనాలు నిలపాల్సి వస్తోంది. ఆటో స్టాండులు లేకపోవడంతో ప్రధాన రహదారిపైనే నిలుపుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఉన్నా దాన్ని ప్రైవేటు లీజుకు ఇవ్వడంతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం పార్కింగ్ స్థలాలు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పార్కింగ్ సమస్య అధికం



పట్టణంలో వాహనాల పార్కింగ్ సమస్య అధికంగా ఉంది. ద్విచక్రవాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఆఖరుకు పాదచారులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి. పెరిగిన వాహనాలకు అనుగుణంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రించాలని అధికారులను కోరుతున్నాం.

– నరసింహులు, పుట్టపర్తి

ఎక్కడ నిలపాలో..?



నేను వివిధ పనుల నిమత్తం పుట్టపర్తికి వస్తుంటాను. ద్విచక్రవాహనం పార్కింగ్ చేయడం చాలా కష్టంగా ఉంది. ప్రత్యేక ప్రదేశం లేకపోవడంతో రోడ్లపై వదిలి వెళ్లాల్సి వస్తోంది. ఇలా పార్కింగ్ చేయడం వలన ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయి. సత్యసాయి మహా సమాధి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వారు వాహనం ఎక్కడ నిలపాలో అర్థం కాని పరిస్థితి. అధికారులు చొరవ తీసుకొని పార్కింగ్ స్థలాలు కేటాంచి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి. – ఈశ్వర్‌రెడ్డి, బీడుపల్లి

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పార్కింగ్ వ్యవస్థ మెరుగుపరచి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోవడం, సిబ్బంది కొరత ఉండడం, ఇతర డ్యూటీలపై వెళ్లడం వంటి సమస్యలు ఉన్నాయి. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ద్విచక్రవాహనాలు కూడా ఎక్కడ పడితే అక్కడ నిలపరాదు. పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమస్యలు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– విజయకుమార్, డీఎస్పీ, పుట్టపర్తి

రీసర్వే పారదర్శకంగా చేపట్టండి

రామగిరి: భూసర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే చేపట్టాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. బుధవారం రామగిరి, పేరూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పైలెట్ రీసర్వే గ్రామం అయిన పేరూరులో క్షేత్రస్థాయిలో పర్యటించి రీసర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రజలు తమ భూసమస్యలను పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశం అన్నారు. అధికారులు రీసర్వేకు వచ్చిన సమయంలో వారికి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రామగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రైతులు భూసమస్యలపై వివిధ గ్రామాల నుంచి కార్యాలయానికి వస్తుంటారన్నారు. వారిని ఇబ్బందులకు గురి చేయకుండా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమానుల్లాఖాన్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, వీఆర్‌ఓలు జగదీశ్వర్ రెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

గాండ్లపెంట: బొలిగుట్లపల్లిలో నిర్వహిస్తున్న భూ రీసర్వేను ఆర్డీఓ ఎస్.ఎస్.రావు బుధవారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వందేళ్ల తర్వాత చేపడుతున్న భూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సర్వే గురించి సర్వేయర్‌లను అడిగి తెలుసుకున్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ముదిగుబ్బ: ఎంఈఓ కార్యాలయంలో బుధవారం ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగాఎంఈఓలు వేమనారాయణ, రమణప్పల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షులు పీరు నాయక్, చంద్రశేఖర్, మండల అధ్యక్షులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కదిరి టౌన్: అదనపు కట్నం కోసం మెట్టినింటి వారు వేధిస్తున్నారని పట్టణంలోని పూలబజారులో నివాసముంటున్న సయ్యద్ సీమా సుల్తానా బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బెంగళూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఖలీంపాషాతో తనకు ఏడేళ్ల క్రితం వివాహమైందని పేర్కొంది. ఇద్దరు కూతుళ్లు పుట్టిన తర్వాత అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్త, ఆడపడచు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

పుట్టపర్తి టౌన్: పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆవుల శేఖర్, వేమయ్య యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు 30 లక్షల ఇళ్లు మంజూరు చేశారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ లబ్ధిదారులంతా అనర్హులని చెబుతోందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఎందుకంత ఆలోచన చేస్తున్నారని ప్రశ్నించారు. మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాల అమలు చేయడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవంటూ సాకులు చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి ఆరో తేదీన చలో కలెక్టరేట్‌కు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, అధ్యక్షురాలు పద్మావతమ్మ, జిల్లా కార్యదర్శి బాలస్వామి, సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు ఆంజనేయులు, రామకృష్ణ, కమతం కాటమయ్య, పవిత్రమ్మ, కుల్లాయప్ప, అన్ని మండలాల కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

మేమెందుకు.. మీరే ఏలుకోండి!

- మా సంతకాల కోసమేనా సమావేశాలు
- మెసేజ్ చూసుకొని హాజరు కావాలా?
- అధికారులపై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యులు

పుట్టపర్తి రూరల్: 'నామ మాత్రపు సమావేశాలు మాకొద్దు. మీరే ఏలుకోండి' అంటూ అధికారులపై మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కమిషనర్ ప్రహల్లాద ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన 2025–26 బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. ఏఏఓ శ్రీనివాసులు బడ్జెట్ అంశాలు చదివి వినిపించే ప్రయత్నం చేయగా పాలక పక్ష సభ్యులు సూర్యాగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అధికారులు వాట్సాప్ గ్రూప్‌లో పెట్టే మెసేజ్ చూసుకుని తాము సమావేశాలకు హాజరు కావాలా అంటూ నిలదీశారు. అధికారుల స్వార్థ ప్రయోజనాలు, బిల్లుల మంజూరుకు సభ్యుల సంతకాలు అవసరమై తమను ఇక్కడకు ఆహ్వానించినట్లుగా ఉందన్నారు. తమ వార్డుల్లో ప్రజల సమస్యలను తీర్చలేని పరిస్థితి రావడానికి, రూ.కోట్ల నిధులు వెనక్కు వెళ్లడానికి అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులను విస్మరించి గణతంత్ర వేడుకలను అధికారులే నిర్వహించుకోవడం సరికాదన్నారు.

అంకెల గారడీ బడ్జెట్

కమిషనర్ ప్రహల్లాద బడ్జెట్ అంచనాలకు సభ్యులకు తెలియజేశారు. 2024–25 బడ్జెట్ రూ.14.53 కోట్లను సవరించి 2025–26 బడ్జెట్‌కు రూ 16.35 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ప్రారంభ నిల్వ రూ.11,37,04,345 కాగా రెవెన్యూ క్యాపిటల్ 16,72,94,750, క్యాపిటల్ వ్యయం రూ.16,35,29,900, ముగింపు నిల్వ 11,74,69195గా ఉంది. ఈ ఏడాది మిగులు రూ.34,59,850 ఉన్నట్లు ఏఈఓ శ్రీనివాసులు తెలిపారు. మురికి వాడల్లో అభివృద్ధి పనుల కోసం రూ.13,83,940, షెడ్యూల్ కులాలకు రూ.5,18,978, షెడ్యూల్ తెగలకు రూ.2,59,489, శిశు సంక్షేమం కోసం రూ.1,72,993, దివ్యాంగులకు రూ.1,03,796 ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. బడ్జెట్ అంకెల గారడీగా ఉందంటూ సభ్యులు అభివర్ణించారు.


సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడి

తాడిమర్రి: సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితేనే మొక్కజొన్న పంటలో అధిక దిగుబడి సాధ్యమని వ్యవసాయ అధికారి రమాదేవి రైతులకు సూచించారు. బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుధవారం నార్సింపల్లిలో ఆమె మొక్కజొన్న పంటలను సందర్శించారు. మొక్కజొన్న పంటను ఆశించి నష్టం కలిగించే వివిధ దశలో ఉన్న కత్తెర పురుగు ఉనికిని గమనించినట్లు చెప్పారు. నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏ ఓబుళమ్మ, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట: వెనుకబడిన తరగతులు(బీసీ), ఆర్థికంగా వెనుకబడిన కులాల (ఈబీసీ) వారి నుంచి సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాండ్లపెంట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో బీసీలకు–11, ఈబీసీ కమ్మకు 1, కాపులకు 3, రెక్కమాను బ్రాంచీలో బీసీలకు 4, ఈబీసీలకు 1, కాపులకు 3, కదిరి స్టేట్‌బ్యాంకు (వ్యవసాయాభివృద్ధి) పరిధిలో బీసీలకు 6, ఈబీసీలకు 1, కాపులకు 8 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. అర్హులైన వారు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి ఏడో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం



సత్యనారాయణ (ఫైల్)

కదిరి టౌన్: పట్టణంలోని నారాయణమ్మకాలనీలో నివాసముండే సత్యనారాయణ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. అనంతపురం రోడ్డులో తోపుడు బండిపై పానీపూరి అమ్ముకుంటూ జీవనం సాగించే సత్యనారాయణ మంగళవారం కూరగాయల మార్కెట్‌కు వెళ్తున్నానని భార్యకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అనుమానం వచ్చి భార్య ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. చుట్టు పక్కల గాలించినా ఆచూకీ తెలియక పోవడంతో బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జయరాం వ్యాఖ్యలు అప్రజాస్వామికం

ధర్మవరం రూరల్: జర్నలిస్టులపై గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేసిన బెదిరింపు వ్యాఖ్యలు అప్రజాస్వామికంగా ఉన్నాయని ఏపీయూడబ్ల్యూజే ఖండించింది. జయరాం మీడియాకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ధర్మవరం డివిజన్ అధ్యక్షుడు జానపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ చౌదరి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు అప్రజాస్వామికం అని వారు ఖండించారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసే పాత్రికేయులను రైలు పట్టాలపై పడుకోబెడతానని హెచ్చరించడం తగదని అన్నారు.

జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతాం



మాట్లాడుతున్న రేపటి రామాంజనేయులు

ధర్మవరం అర్బన్: జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ పోరాటం సాగిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు తెలిపారు. ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో బుధవారం జరిగిన సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మవరం డివిజన్ అధ్యక్షుడిగా మురళీగౌడ్, గౌరవాధ్యక్షుడిగా శ్రీశైలం భాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పతకమూరి నాగభూషణం, ఉపాధ్యక్షులుగా గంటపార నాగరాజు, రాజా, నాగార్జున, సహాయ కార్యదర్శులుగా అబ్దుల్లా, దేవేంద్రచౌదరి, రామాంజనేయులు, సాయిప్రభు, కోశాధికారిగా భీమనేని వెంకటేశ్వరచౌదరి, ప్రచార కార్యదర్శిగా జ్వాలా ప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మల్లికార్జున, ఆంజనేయులు, మంజు, బాబయ్య, శివానాయక్, నరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదన్నారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

ధర్మవరం రూరల్: రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గిరక రమాదేవి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సాయి మనోహర్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, డాక్టర్ పుష్ప తదితరులు హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం నుంచి పంచాయతీలకు నిధులు రావడం లేదని, ఇలాంటి సమయంలో గ్రామాల్లో మౌలిక వసతులు ఎలా కల్పించాలని పలువురు సర్పంచులు ప్రశ్నించారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆశాకార్యకర్త గుండెపోటుతో మృతి



ఉమాదేవి (ఫైల్)

నల్లచెరువు: యర్రగుంటపల్లి ఆశా కార్యకర్త ఉమాదేవి (48) బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది కలిసి గ్రామాల్లో కుష్ఠు రోగుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే అనంతరం ఆశా కార్యకర్తలు తమ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ నమోదు చేయించాలని వైద్య అధికారులు తెలపడంతో బుధవారం ఉమాదేవి తన భర్త శ్రీనివాసులుతో కలిసి ద్విచక్రవాహనంలో నల్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. అక్కడ వివరాలు నమోదు చేయించి హాజరు రిజిష్టర్‌లో సంతకం చేస్తుండగా గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వైద్యాధికారి డాక్టర్ కల్పనరెడ్డి ప్రథమ చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఉమాదేవి మృతి చెందింది.

మహిళలు, బాలికల భద్రతే లక్ష్యం

పుట్టపర్తి అర్బన్: సమాజంలో మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని పుట్టపర్తి మహిళా పోలీస్ స్టేషన్ సీఐ గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెంగళమ్మచెరువు గ్రామంలో నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చిన్నారులు, మహిళలపై నేరాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రూరల్ ఎస్‌ఐ లింగన్న, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించండి

ధర్మవరం అర్బన్: ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వ్యాపారులు సహకరించాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ కోరారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం టూటౌన్ సీఐ రెడ్డప్ప సమక్షంలో డీఎస్పీ హేమంత్‌కుమార్ పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన వ్యాపారాలు చేసే వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ షాపుల ముందు వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. వ్యాపారులు తమ దుకాణం ముందు నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.